వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వైష్ణవి

కందుకూరు, డిసెంబర్ 4 : మండ ల పరిధిలోని నెదునూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదువు కుంటున్న కొత్తగూడ గ్రామానికి చెందిన ఆశవర్కర్ చీమల అనిత, శేఖర్‌ల కూతురు చీమల వైష్ణవి రాష్ట్ర స్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందింది. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో 91 మంది విద్యార్థులు పోటీ పడగా అందులో విద్యార్థిని వైష్ణవి గెలుపొందింది. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన చేతుల మీ దుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నా రు. ఈ సందర్భంగా దేవసేన మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయ స్థాయి కి ఎదగాలని కోరారు. వైష్ణవి తల్లిదండ్రులు గర్వపడే విధంగా రాష్ట్ర స్థాయి లో గెలుపొందడం గొప్ప విషయమని తెలిపారు. అంతే కాకుండా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, విద్యాధికారి నరసింహ, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

కీసరగుట్టలో మహారుద్ర హోమం

కీసర, డిసెంబర్ 4: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామికి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మహారుద్రహోమా న్ని బుధవారం నిర్వహించారు. కీసరగుట్టలో కార్తీక మాసోత్సవం వేడుకలు ముగియడంతో ఉదయం కీసరగుట్ట ఆలయంలో రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశానుసారం మహారుద్ర హోమం, గణపతి హోమం, అన్న దానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే ముందస్తు పనులు ..!

- బడంగ్‌పేట కార్పొరేషన్‌లో టెండర్ లేకుండానే ముందస్తు పనుల వేగం ..
- అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న కొందరు కార్పొరేటర్లు..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బడంగ్‌పేట, నవంబర్ 4 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో కమీషన్ల కోసమే ముందస్తు పనుల వేగం పెంచారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల చేతులు తడపకుండా బిల్లులు చేసే పరిస్థితి లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. పాలకవర్గం పదవీ కాలం జనవరితో ముగుస్తుంది. దీంతో దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క బెట్టుకోవాలన్న చందంగా హడావుడి చేస్తున్నారు. కమీషన్ల కోసం అధికారులపై ఒత్తిడి పెంచి కాంట్రాక్టర్లతో ముందస్తు పనుల వేగం పెంచారు. పాలకవర్గం పదవీ కాలంతో పాటు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారన్న ప్రకటన పాలకవర్గంలో కలవరం మొదలైయింది. ఎలాగైనా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఖజాన ఖాళీ చేసే పనిలో పడ్డారు. అవసరం ఉన్నా లేకున్నా ఎక్కడో ఒక చోట పనులు చేయించాలని నిర్ణయించారు. టెండర్ ప్రక్రియ ద్వార పనులు చేయిస్తే ఆలస్యం అవుతుందని భావించి ముందస్తు పనులు చేయిస్తున్నారు. టెండర్ సంగతి మేము చూసుకుంటామని పాలకవర్గ సభ్యులు కాంట్రాక్టర్లకు భరోసా ఇస్తున్నారు. అధికారులకు ఇబ్బందికరంగా మారే పనులను సైతం చేయిస్తున్నట్లు తెలుస్తోంది. కొంత మంది అధికారులు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

బిల్లుల సంగతి ఏమిటీ?

నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు గండం పొంచి ఉంది. రెండు నెలల్లో ప్రస్తుత పాలక వర్గం పదవీకాలం ముగుస్తుంది. ఆ తర్వాత ప్రత్యేక అధికారుల పాలనలో ఉంటుంది. అప్పుడు తప్పనిసరిగా నిబంధనలను పాటించవలసి ఉంటుంది. లేకపోతే జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడానికి అవకాశం ఉంది. అయితే.. ముందస్తు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి ఏందని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. చేసిన పనులకు బిల్లుల కోసం ఇబ్బందులు పడక తప్పదు.

ఒక్క రోడ్డుకు మూడుసార్లు తీర్మానాలా..

కార్పొరేషన్‌లో అవసరం ఉన్నా లేకున్నా పనులు పెట్టడం పట్ల కొంత మంది కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకే రోడ్డుకు మూడు సార్లు తీర్మానాలు చేయడం, బిల్లులు పెట్టడం అంతర్యం ఏమిటని ఏకంగా కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతిపై కొంత మంది కార్పొరేటర్లు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

పై అధికారుల ఆదేశాల మేరకే ..

పై అధికారుల ఆదేశాల మేరకే నిధులు కేటాయిస్తున్నాం. బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి గణేశ్‌చౌక్ వరకు మూడుసార్లు నిధులు విడుదల చేసిన మాట వాస్తవమే. మొత్తం ఇప్పటి వరకు రూ.65లక్షలు కేటాయించాం. మొదటిసారి రూ.20లక్షలు , రెండోసారి రూ.35లక్షలు పెట్టాం. అయినా కూడా సరిపోకపోవడంతో మరో రూ.పది లక్షలు కేటాయించాం. పైనుంచి బాగా ఒత్తిడి ఉంది. పై అధికారులు చెప్పినప్పుడు చేయాలికదా. రోడ్డు విస్తరణ కూడా చేయవలసి ఉంది.

– డీఈ జ్యోతి

సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

పార్కులను అభివృద్ధి చేస్తాం

ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, డిసెంబర్ 4: నియోజకవర్గ పరిధిలోని పార్కులను ఆహ్లాదకరంగా అభివృద్ధి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బుధవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బుధవారం స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఉండే అన్నీ పార్కుల్లో సుగంధపు వాసనలిచ్చే పూల మొక్కలు, పర్యాటకులకు చలువనిచ్చే పచ్చని చెట్లునాటి, పార్కుల గత స్వరూపాన్ని మారుస్తానన్నారు. అంతే కాకుండా పార్కుల సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావారణాన్ని కల్పించే విధంగా పార్కులు అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఇందులో భాగంగా సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్క్ ప్రవేశ ద్వారం వద్ద నెమలి ఆకారంలో ఒక అందమైన దృశ్యాన్ని వేయించడంతోపాటు, పార్కులో ఓపెన్ జిమ్, వాలీబాల్ కోట్, యోగా సెంటర్, టాయిలెట్స్, నూతనంగా మరో బోర్‌వెల్ ఇంకా కొన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, నాయకులు రాకేశ్ ఠాగూర్, తోట శేఖర్, భాస్కర్, గంగపుత్ర, తిలక్‌రావు, జగన్నాథ్‌రెడ్డి, మధుసాగర్, శ్రీకాంత్, అశీష్, టింకు, నరేశ్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణాలకు చర్యలు

ఎస్బీహెచ్ గడ్డిఅన్నారం కాలనీలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం తర్వాత ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణారవీందర్ రెడ్డిను సన్మానిస్తున్న కాలనీవాసులు

సైదాబాద్, డిసెంబర్ 4 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్–గడ్డిఅన్నారం కాలనీలో రూ.14.5 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంక్ కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఇప్పటికే కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేశామని తెలిపారు. స్థానిక ఇబ్బందులను అధికారులు ప్రణాళిక బద్ధంగా పరిష్కరించడా నికి కృషి చేయాలని సూచించారు. అదే విధంగా అపరిష్కృత సమస్యలను వేగవంతంగా పూర్తి చేయడా నికి తగు చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎస్బీహెచ్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

డైరెక్టర్ జనరల్ అసిత్‌కుమార్ సాహు

మన్సూరాబాద్, డిసెంబర్ 4: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీజీ అసిత్‌కుమార్ సాహు బుధవారం నాగోల్, బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీజీ అసిత్‌కుమార్ సాహును ఆల్ ఇండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్శ మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణల ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించి.. పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. బండ్లగూడ జీఎస్ఐ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న ఆడిటోరియంకు మరమ్మతులు చేపట్టాలని కోరా రు. పలు విభాగాల్లో 20 సంవత్సరాలుగా ఒకే క్యాడర్‌లో ఉన్న ఉద్యోగులు, స్టోర్స్ స్ట్రీమ్స్ ద్వార ఎంపికైన ఉద్యోగులకు పదోన్నతులు రావ డం లేదని.. క్యాడర్ రివ్యూ ద్వార వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ఓ ఎస్సీ, ఎస్టీ మీట్‌ను త్వరలో నిర్వహించాలని డీజీని జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్శ మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీజీ అసిత్ కుమార్ సాహు హామీనిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐ ఏడీజీ, హెచ్ఓడీ ఘటబాజే, డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ ఆఫీస్ హోర్మోహన్ మిశ్రా, అసోసియేషన్ వైస్‌చైర్మన్ బి. శ్రీనివాసరావు, బి. ఆనంద్‌కుమార్, ఎ. మేఘరాజ్, బి. ప్రభాకర్, జి. ప్రకాశ్‌రావు, బీకే అమర్‌నాథ్, దేవయ్యానా యుడు, అనిల్‌కుమార్, బి. నరేశ్ పాల్గొన్నారు.

బండ్లగూడ జీఎస్ఐ కార్యాలయానికి విచ్చేసిన డీజీ అసిత్‌కుమార్ సాహును సత్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ దళ్ జాతీయాధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 4: కేంద్ర ప్రభుత్వం జనాభా ధామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ దళ్ జాతీయాధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో బీసీ సం ఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యా ప్తంగా కులగణన నిర్వహించినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం వైఫలమైందని విమ ర్శించారు. కులగణనపై బీజేపీ మంత్రులు, ఎంపీలకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రధానిపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మాదిరిగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్, అసెంబ్లీల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవార్డుల ఎంపికలో వికలాంగులకు అన్యాయం

అంధుల అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి చిందాల శ్రీశైలం

మలక్‌పేట, డిసెంబర్ 4 : ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి అవార్డుల ఎంపికలో అంధులకు, ఇతర వైకల్యం కలిగిన వికలాంగులకు అన్యాయం జరిగిందని అంధుల అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి చిందాల శ్రీశైలం ఆరోపించారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన 21 రాష్ట్రస్థాయి అవార్డుల్లో శారీరక వికలాంగ అభ్యర్థులకు 15 అవార్డులు, బధిర అభ్యర్థులకు 3 అవార్డులు ఇవ్వడం జరిగిందని, అంధుల్లో ఇతర 19 రకాల వైకల్యం గల అభ్యర్థులకు ఒక్క అవార్డును కూడా కేటాయించకపోవడం తీవ్ర అన్యాయమని ఆయన పేర్కొన్నారు. వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం ఇది వివక్షత కిందకే వస్తుందన్నారు . వికలాంగులందరినీ సమానంగా చూడాల్సిన ప్రభుత్వం, అవార్డుల్లో 90 శాతం కేవలం శారీరక వికలాంగులకే ప్రాధాన్యతనివ్వడం ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అంధులకు ఇతర వైకల్యం గల అభ్యర్థులకు అవార్డుల్లో చోటు లభించకపోవడం బాధాకరమని, అవార్డుల ఎంపిక కమిటీ రాజకీయ ఒత్తిడులకు తలొగ్గి జరిగిందని ఆరోపించారు. అవార్డులు ఇచ్చిన వారిలో ఒక్క అంధ అభ్యర్థి కూడా లేరని ఆయన పేర్కొన్నారు. అవార్డుల ఎంపికలో జరిగిన అన్యాయంపై తగిన విచారణ జరిపించి అవార్డుల విలువలను కాపాడాలని దివ్యాంగ సంఘాల నేతలు కోరుతున్నారని అన్నారు.

ప్రతి తల్లికి ఉత్తమ సంరక్షణ అందించడమే లక్ష్యం

అబిడ్స్,డిసెంబర్ 4. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి తల్లికి ఉత్తమ సంరక్షణ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సీ. శ్రీనివాస్ అన్నారు. మాతా, నవజాత శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకుగాను బుధవారం పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీ సత్యసాయి హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ పరిశోధనా విభాగం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు శ్రీసత్యసాయి ట్రస్ట్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్‌లు ఎంవోయూలపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సంధర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మనందరిదీ ఒకే లక్ష్యమని, వెనుకబడిన వర్గాల గర్భిణులు, నవజాత శిశువులు, కుటుంబాలకు ఉత్తమమైన సంరక్షణ అందించడమేనన్నారు. గర్భధారణ, ప్రసవ సమయం,ప్రసవానంతరంతో పాటు శిశువు జీవితంలోని ప్రారంభ వారాల వరకు ఈ సంరక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఎండీ ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడుతూ స్త్రీ కేంద్రీకృతమైన ప్రసవ పద్ధతులకు మార్గదర్శకత్వం వహిం చింది ఫెర్నాండెజ్ ఆసుపత్రి అని అన్నారు. గర్భధారణ,ప్రసవ విషయంలో మహిళలు స్వతహాగా నిర్ణయం తీసుకునే స్వేచ్ఛనిచ్చిం దన్నారు. మిడ్‌వైఫరీ ప్రొగ్రామ్‌ను విజయవంతం చేయాలన్నారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఆర్కేపురం, డిసెంబర్ 4 : రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని షైన్‌వేవ్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్.ముస్తఫా పేర్కొన్నారు. బుధవారం ఏఎండీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం డా.ముస్తఫా మాట్లాడుతూ.. ఒక్క బ్లడ్ డోనర్ నుంచి సేకరించిన రక్తం ద్వారా తెల్ల రక్త కణాలు, ఎర్ర రక్త కణాలు ఇద్దరి నుంచి ముగ్గురికి అందించవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా తయారవుతారని చెప్పారు. ప్రతి నిత్యం ఎంతో మంది ప్రమాదాల బారినపడి సరైన సమయంలో రక్తం అందకపోవడంతో విలువైన ప్రాణాలు పోతున్నాయన్నారు. అలాంటి వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసినవారికి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ లక్ష్మి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి..!

కందుకూరు, డిసెంబర్ 4 : పేదలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులు కిలోకు దాదాపు రూ.15 వరకు లబ్ధిదారులకు చెల్లించి వాహనాల్లో తరలిస్తున్నారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలో ప్రతీ నెల మొదటి వారంలో లబ్ధిదారులు రేషన్ తీసుకున్న వెంటనే దళాలు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వీటిని నగరంలోని చాంద్రాయణగుట్ట, ఎల్‌బీనగర్, నల్గొండ, తదితర ప్రాంతాలతోపాటు పౌల్ట్రీ ఫాంలకు విక్రయిస్తున్నారు. ఈ రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేయించి ఆకర్షణీయమైన బస్తాల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. ఇలా ప్యాకింగ్ చేసిన సన్నబియ్యాన్ని తిరిగి ప్రజలకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు సేకరించిన బియ్యాన్ని కోళ్లఫాంలలో అమ్ముకుంటున్నారు.

రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు

ప్రభుత్వం సబ్సిడీపై పేద ప్రజలకు అందజేసే రేషన్ బియ్యాన్ని క్రయవిక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. విక్రయ దారులపై పీడీ యాక్టును నమోదు చేసి జైలుకు పంపుతాం. అంతే కాకుండా వాహనాలను సీజ్ చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందజేస్తున్న బియ్యాన్ని లబ్ధిదారులు అమ్ముకోవద్దు. ఎవరైన విక్రయిస్తున్నట్లు సమాచారం వస్తే తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటాం. *– గోపాల్, తహసీల్దార్, కందుకూరు మండలం*

7న విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ, డిసెంబర్ 4: విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ యువత కోసం ఈనెల 7న రామంతాపూర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. యువతీ యువకులు పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9848199744, 9491888266 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రంగారెడ్డి కోర్టుల ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న తెలంగాణ హిందూ న్యాయవాదుల సంఘం

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బంగ్లాదేశ్ హిందువులపై దాడికి నిరసన

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్4(నమస్తే తెలంగాణ): బంగ్లాదేశ్‌లో హిందువులపై ఆటవిక దాడులను నిరసిస్తూ తెలంగాణ హిందూ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లా కోర్టుల ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పీఠం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. హిందూ ధర్మరక్షణ కోసం కృషి చేస్తున్న హిందూ స్వామీజీలను అరెస్ట్ చేయడం, అమాయక ప్రజలపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి నర్సింగోజ్ కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికైన ప్రజలు మేల్కొని వారి దురాగతాలను ఎండగట్టాలని, కేంద్రం అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని నాయకులు జశ్వంత్, గురువయ్య గౌడ్, నగేశ్ నాయక్, బాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కొండూరు వినోద్‌కుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిని శిక్షించాలి

ఆర్కేపురం, డిసెంబర్ 4 : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని నిరసిస్తూ శైవక్షేత్ర పీఠం తెలంగాణ ఆధ్వర్యంలో పరమ పూజ్య శివ స్వామీజీ సూచన మేరకు శైవ క్షేత్రం పీఠం నుంచి కొత్తపేట భవానీ మాత టెంపుల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి పరమ పూజ్య ఆత్మానంద భారతి స్వామి, శివ కామేశ్వరి ఆనంద మాతాజీ, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, ఎల్‌వీ కుమార్, శ్రీ శైవ క్షేత్ర కార్యనిర్వాక అధ్యక్షుడు విజయవాడ, శ్రీశైవ క్షేత్ర వనిత శక్తి ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిత హైమ, శ్రీ శైవ క్షేత్ర పీఠం మేనేజర్ వి.కోటేశ్వరరావు, వాసవి ఇంటర్నేషనల్ పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు జగిని శ్రీనివాస్‌లు హా జరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడులను అక్కడి ప్రభుత్వం వెంటనే నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మదీక్ష సేవక్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రవీణ్ దుబే, దేవి దేవతల చిత్రపటాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాంబమూర్తి, వనిత శక్తి రాష్ట్ర అధ్యక్షురాలు నకరికంటి రేణు క, కొత్తపేట్ భవానీ మాత దేవస్థానం కమిటీ భవన ఋషి, కొత్తపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాధురి వాసు ఉన్నారు.

పోటీల్లో తెలంగాణ సత్తాను చాటాలి: ఎమ్మెల్యే

కాప్రా, డిసెంబర్ 4: ఫెడరేషన్ కప్ బాల్‌బాడ్మింటన్ క్రీడల్లో తెలంగాణ జట్టును ప్రథమ స్థానంలో నిలుపాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. కర్ణాటకలోని కుశల్‌నగర్,కొడుగు జిల్లాలో ఈనెల 6 నుంచి 8వరకు జరిగే 8వ ఫెడరేషన్ కప్ బాల్‌బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు ఎంపికైన తెలంగాణ జట్టుకు నాలుగు రోజులపాటు నిర్వహించిన సన్నద్ధత శిబిరం ముగింపు రోజున వివిధ జిల్లాలనుంచి శిబిరానికిఎంపికైన బాల్ బాడ్మింటన్ క్రీడాకారులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి పరిచయం చేసుకొన్నారు. వారితో ముచ్చటించి, అభినందించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసుల అభ్యర్థన మేరకు బాల్‌బాడ్మింటన్ కోర్టుకు సీసీకెమెరాలు, కాంపౌండ్‌వాల్, టాయిలెట్స్ నిర్మా ణం చేయిస్తానని తెలిపారు. కార్పొరేటర్ శిరీషాసోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, బీఆర్‌ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, తెలంగాణ బాల్‌బాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశంలో కులగణన చేపట్టాలి

డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్

మన్సూరాబాద్, డిసెంబర్ 4: దేశంలో జరగనున్న జనగణన సమయంలోనే కులగణన చేపట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ డాక్టర్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చా రు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 11న ఢిల్లీలో నిర్వహించనున్న బీసీల జాతీయ సెమినార్, ధర్నా పోస్టర్‌ను బుధవారం ఎల్బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఆ విష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిన విధంగానే కేంద్ర ప్రభుత్వం దేశంలో కులగణన చేపట్టి ఇతర సామాజిక సమస్యలపై స్పందించాలన్నారు. సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్ర భుత్వం ఓబీసీల సమస్యల పరిష్కారం పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 11న నిర్వహించనున్న ధర్నాలో బీసీ ఎంపీలు, రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీసీ సంఘాల ప్రతినిధులు వేణు, గోరశ్యాంసుందర్‌గౌడ్, బొంగు వెంకటేశ్‌గౌడ్, మేడిగ శ్రీధర్‌గౌడ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



11న ఢిల్లీలో నిర్వహించనున్న బీసీల సెమినార్, ధర్నా పోస్టర్‌ను ఎల్బీనగర్‌లో ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్

ఎంఈడీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఓయూ పరిధిలోని ఎంఈడీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎండీహెచ్ఎం పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4 : ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షా ఫీజును ఈ నెల 9 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను నెలలోనే నిర్వహించనున్నటు, పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

మృతదేహం లభ్యం

జవహర్‌నగర్, డిసెంబర్ 4: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరి ధి వికలాంగుల కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సబ్ ఇన్‌స్పెక్టర్ రామునాయక్ కథనం ప్రకారం ... జవహర్‌నగర్ కార్పొరేషన్ వికలాంగుల కాలనీలోని మైదానంలో ఓ మగవ్యక్తి చనిపోయాడని స్థానికులు గుర్తించారు. వెంటనే 100 కు డయల్ చేయగా... పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 30–35ఏండ్ల వయసు ఉంటుందని, నలుపురంగు టీషర్టు, బ్లూకలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మైదానంలో నిద్రకు ఉపక్రమించగా గుర్తు తెలియని వాహనం తలపై వెళ్లి ఉండొచ్చని, భిక్షటాన చేసే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.